# చందన

సాయంత్రం ఐదు దాటుతూనే వర్షం మొదలైంది.

బద్ధకంగా ఆవులించింది శాంతి. ''ఇదేంటోయ్ ఇలా ఇరుక్కుపోయాం. వర్షం వెలిసేట్లు లేదే...'' అంది కిటికీ దగ్గరకు పోయి బయటకు చూస్తూ.

మాధవి దీక్షగా కంప్యూటర్‌కేసి చూస్తోంది. చిన్నపాపాయి క్షణాల మీద మారిపోతూ, బడికిపోతూ, కాలేజి మెట్లెక్కుతూ కన్నెపిల్ల అయిపోతోంది. గబగబా మారిపోతున్న వయసు తాలూకు ఒక్కో చిత్రం చాలా అద్భుతంగా ఉంది. బ్యాక్‌గ్రవుండ్‌లో కంపెనీ ఎదుగుదలను చూపించే గ్రాఫ్. మాటలతో పనిలేకుండా, కంపెనీ లాభాలు చూపించే యాడ్ ఫిలిం అది.

''ఇలా రావోయ్ శాంతీ ఇదోసారి మాడు''

శాంతి వెనక్కి వచ్చి కంప్యూటర్ పక్కనే ఉన్న స్టూల్ మీద కూర్చుంది. మళ్ళా స్క్రీన్ మీదకి యాడ్ ఆపరేట్ చేసింది చందన. ఎలా ఉందన్నట్లు కళ్ళెత్తి శాంతివైపు చూసింది చందన. కంప్యూటర్ వైపు దృష్టి మరల్చినా, మళ్ళీ చందన కళ్ళే గుర్తొచ్చాయి. అబ్బ ఏం కళ్ళవి. ఎంత

జాలిజాలిగా చూసే కళ్ళు. స్క్రీన్‌వైపు చూస్తూ ఆపరేట్ చేస్తూన్న చందన వైపు చూసింది శాంతి.

చక్కని ముక్కు, తీర్చిదిద్దినట్లున్న శరీరం, ముఖ్యంగా ఆ కళ్ళు... బాప్‌రే ఈ అమ్మాయి చక్కని చుక్క.

కరెంట్ పోయింది. ఇన్వర్టర్‌తో వెలిగే చిన్న ట్యూబ్‌లైట్ వెలిగింది ఓ మూల. అందరూ లేచి కిటికీ దగ్గరే ఉండే టేబుల్ చుట్టూ కూర్చున్నారు.

''తెగ ఆవులింతలొచ్చేస్తున్నాయోయ్... చాలా అలసిపోయాను'' శాంతి బద్ధకంగా ఛెయిర్‌లో వాలింది.

మాధవి ఫ్లాస్క్‌లో ఉన్న టీ కప్పుల్లో పోసింది. చందన మొహమాటంగా వద్దంది.

''ఫర్వాలేదు తీసుకో... ఇప్పుడీ వర్షంలో ఇంటికెలా వెళతావు''

చందన భయంగా చూస్తోంది.

''వెళ్ళాలండీ...'' అన్నది బెంగగా.

''ఎవరైనా ఎదురుచూస్తూ ఉంటారా?''

''ఊహూ... ఆమెకు కోపం వస్తుంది''

''ఒహో... యుమీన్ మిసెస్ గౌతమ్.... ఎందుకు ఆమె కోపం తెచ్చుకోవటం మధ్యని''

''ఆఫీస్ అయ్యాక బయట ఉండడం ఆమెకు ఇష్టం ఉండదు. నేను వాళ్ళింట్లోనే ఉంటాను కదా''

శాంతి తలూపింది. శ్రద్ధగా చూస్తుంది కాబోలు అనుకొంది మనసులో.

''ఏం జరిగింది ప్రొద్దున కేసూ...'' అన్నది మాధవి టీ కప్పు టేబుల్ మీద పెట్టేస్తూ.

''అబ్బ... చెప్పనే లేదు కదూ మధూ... ఆ అమ్మాయి టీచరు. ఆమె మొగుడే చంపి పారేసి ఉరిపెట్టాడు. అటూ ఇటూ తిరిగి కాస్త హడావిడి చేసి శవాన్ని తగలేద్దామని వాడి ప్రయత్నం. ఈలోగా పిల్ల తల్లి వచ్చి వాలింది. ఆవిడ మహిళా సంఘంలో పనిచేస్తుంది. కాస్త తెలివిగా ఉంది. వస్తూనే పిల్లని పట్టుకొని గోల పెట్టేసింది. నలుగురినీ పోగేసింది. పోలీసులకు వార్త వెళ్ళింది. మొగుడు బాగా ఇన్‌ఫ్లుయెన్స్ చేశాడు కేసు లేకుండా. డిఎస్‌పి ఇంద్ర అని రూరల్ బ్యాక్‌గ్రవుండ్. దయగల మనిషి గనక వాడి ఆటలు సాగలేదు. కానీ కష్టం రా. ఆవిడ నోరు

వేసుకొని ముందు మనకి కబురు పెట్టి, మట్కా జనాన్ని పోగువేసి గోడుగోడున ఏడవబట్టి గానీ లేకపోతే డబ్బుతో చాలా పన్లు జరిగిపోతాయి. భలే దిగులుగా ఉంటుంది'' మాధవి ప్రేమగా నవ్వింది ఆమెవైపు చూసి.

''శాంతీ భలే గర్వంగా ఉంటుందే నిన్ను చూస్తుంటే. ఒక్క దానివే పనుల్లో కూరుకుపోతున్నావని దిగులుగా ఉంటుంది. పొట్ట తిప్పల కోసం ఆఫీస్ నడపక తప్పదు. యాడ్ ఏజెన్సీ టైమ్ మొత్తం మింగేస్తోంది. నీకేం చేయలేకపోతున్నాను'' అన్నది మాధవి.

శాంతి ప్రేమగా మాధవి చేయి తాకింది.

''పిచ్చీ. నువ్వు చేసే సాయం ఎంత పెద్దదో నీకు తెలియదు. నువ్వు అంత ఉదారంగా ఈ ఖర్చులన్నీ భరించకపోతే నేనేం పనులు చేస్తాను. పొద్దుట నువ్వు పంపిన డబ్బు గంటలో అవగొట్టాను. ఎంత ట్రాజడీ అంటే ఆ పిల్ల శవం అక్కడ ఉంది. తల్లి గుండెలు పగిలేలా ఏడుస్తోంది. మైళ్ళ దూరం నడుచుకుంటూ, పరిగెత్తుకుంటూ ఏడుస్తూ వచ్చిందట. తూలిపడిపోతోంది. తాగేందుకు ఆమెకు కప్పు పాలు ఇవ్వకపోతే, కూతురుతోపాటు ఆమెనూ సాగనంపవలసి వచ్చేది. కూలి చేసుకొనే ఇల్లు. పిల్ల పోయిన దుఃఖంతో ఆ కుటుంబం ఘోష పెడుతోంది. ఇంత దారుణానికి వొడిగట్టిన ఆ పిల్ల మొగుడ్ని చంపాలనిపిస్తోంది. మగాళ్ళని ఏం చేసినా తప్పులేదు. వాళ్ళు ఏం చేసినా చేయగలరు. ఇంత స్వార్థం ఏంటబ్బా?''

''అబ్బో ఫెమినిస్టు బయలుదేరింది'' నవ్వింది మాధవి.

''ఈ విశేషణాలేమిటంట? అసలు ఫెమినిస్ట్ అంటే ఏమిటో తెలుసా....''

మాధవి నవ్వుతూ చెవులు మూసుకుంది.

''ఊరికే అన్నాలే బాబూ. ఎందుకే నీకు ఆడవాళ్ళంటే అంత ప్రేమా?''

''నేను ఆడదాన్ని కాబట్టి. మా అమ్మ, అక్క, మగాడి చేతిలో విక్టిమ్స్ కాబట్టి. అక్క అర్థాంతరంగా వెళ్ళిపోయింది కాబట్టి...''

మాధవి, శాంతి చేయి తన చేతిలోకి తీసుకొంది. కళ్ళ ముందు హాయిగా నవ్వే అరుణక్క మెదిలింది. తనకంటె రెండేళ్ళు సీనియర్. అసలా పలకరింపులోనే ఎంత దయా, ప్రేమా.

''శాంతీ బాక్స్‌లో తిండి తినవే బాబూ. డైటింగ్ పేరు చెప్పి పారేశావా? అబ్బ బొద్దుగా వుంటే ముద్దే లెద్దూ హాయిగా తినాలి''

కళ్ళు నీళ్ళతో నిండిపోయాయి మాధవికి. అరుణక్క నవ్వుని తుడిచేసి, ఆమెను డబ్బు కోసమే చిత్రహింసలు పెట్టిన వాడెంత నిర్భాగ్యుడు? ఎక్కడికి వెళ్ళావక్కా....

ఆపుకొన్నా ఆగని నిట్టూర్పు వచ్చింది. శాంతి వెంటనే తేరుకొంది. మాధవిని పలకరించి లాభం లేదు. ఇప్పుడు ఇక ఏడుపు మొదలుపెడుతుంది. ''ఏంటోయ్ చందనా. అలా నిశ్శబ్దంగా అయిపోయావ్. వర్షం తగ్గగానే నేను డ్రాప్ చేస్తాన్లే''

''అబ్బే అది కాదండీ... నేనేదో ఆలోచిస్తూ వున్నా. వర్షం అంటే నాకు భయం'',

''అసలు సాయంకాలం వర్షంలోనే ఏదో డిప్రెషన్ ఉంటుందనుకో. చిరాగ్గా ఉంటుంది. అన్నట్లు నీకు గుర్తుందా యశోధర ఇప్పుడు... వచ్చింది తెలుసా?''

''ఏమిటంట?''

''నీకు శంకర్ గుర్తున్నాడా... యశోధర మొగుడు. వాడికి ఏదో అనుమానపు రోగం. అస్తమానం దాన్ని విసిగించి చంపేవాడట. లేచి వచ్చేసింది. నిన్న మన ఆఫీస్‌లో ఉద్యోగం కోసం వచ్చింది. చైతన్య వాళ్ళు కొత్తగా ఆఫీస్ ఓపెన్ చేశారు కదా. పి.ఆర్.ఓ కావాలన్నారు. దాన్ని అటు తరిమాను... చాలా య్యాక్టివ్. ఆ ఉద్యోగం దానికి బాగా సూటవుతుంది''

''అంటే ఏమిటే నీ ఉద్దేశం. ఉద్యోగానికి ఎలాంటి క్వాలిఫికేషన్ కావాలో... అది కాదా ముఖ్యం. అది య్యాక్టివ్‌గా ఉంది. ఇది డల్‌గా ఉంది' అని మనమే మాట్లాడతాం''

''అసలు ఆడాళ్ళు ఎలా ఉండాలో చెప్పవే బాబూ. ''

''ఆడాళ్ళు ఎలా ఉండాలా? మగాళ్ళకు ఎలా కన్వీనియంట్‌గా ఉంటుందో అల్లా. పోనీ నువ్వెలా ఉండగలవు''

''ఏమో బాబూ నేను నాలాగే ఉంటాను''

''ఇలా వుంటే ఏ మగాడికీ నచ్చవే నువు''

''పోనిద్దూ మంచి ఆడపిల్లని పెళ్ళాడేస్తా. హాపీగా కలిసి వంటొండుకొని హాయిగా చీరలు కొనుక్కుని, గంజి పెట్టుకొని దర్జా....''

''ఛీ...'' ఛీత్కారంగా అన్నది చందన. ఒక్క విసురుతో లేచి నిలబడింది. ఆ గొంతులో వినబడ్డ వ్యతిరేకతకి, అసహ్యానికి శాంతి తెల్లబోయింది.

చందన గజగజ వణికిపోతోంది.

''నా వల్ల కాదు. ఇంక నా వల్ల కాదు'' అంది ఏడుస్తూ... మొహమొహాలు చూసుకొన్నారు. ఏమయిందో అర్థంకాలేదు.

''ఏమిటమ్మా ఏమిటి? ఏమయిందీ వంట్లో బాలేదా?''

వందన వెక్కి వెక్కి ఏడుస్తోంది.

మాధవి సైగ చేసింది. శాంతి వందన భుజాలు పట్టుకొని కుర్చీలో కూర్చోబెట్టింది. లేచి ఫ్రిజ్‌లో మంచినీళ్ళ సీసా తీసుకొచ్చింది. కాసేపు అంతా నిశ్శబ్దంగా కూర్చున్నారు. దుఃఖోద్వేగంతో వందన భుజాలు ఎగిరిపడుతున్నాయి. ఉద్రేకం తగ్గేవరకూ ఇద్దరూ ఏం మాట్లాడలేదు. వందన నెమ్మదిగా తేరుకొంది. పైటకొంగు ముందుకి లాక్కొంది. గ్లాసులో మంచినీళ్ళు పోసి అందించింది మాధవి. తాగేసి గ్లాసు కింద పెట్టేసి తల వంచుకుని కూర్చుంది వందన.

అప్పుడు అడిగింది శాంతి. ''చెప్పమ్మా ఏమయిందీ? ఎందుకలా అరిచావు? ఏదయినా ఇబ్బందిగా ఉందా? వంట్లో బాలేదా? ఎందుకు ఏడ్చావు?''

నిరంతరం కౌన్సిలింగ్ చేసే అనురాగ పూరితమైన గొంతది. ఎలాటి కష్టానికైనా నేనున్నానని ధైర్యం చెప్పే గొంతది. వందన భయంగా చూసింది.

''పర్లేదు చెప్పు. నువ్విక్కడ చెప్పిన విషయాలు ఏవీ ఆఫీస్ గది దాటి అవతలకి పోవు. నేను నోరు విప్పను''

వందన తెలుసన్నట్లు తల ఊపింది.

''తెలుసండీ.. నేను రోజూ చూస్తాను. వింటాను కదా. నా విషయం ఎలా చెప్పాలో తెలియక ఊరుకున్నాను. మీరు ఆడవాళ్ళ విషయంలో దయ చూపించడం వాళ్ళ కోసమే పనిచేయటం చూశాను. వాళ్ళకు ఎలాటి కష్టం వచ్చినా తపించి పోవటం నాకు తెలుసు... కానీ నేను... నేను''

''చెప్పమ్మా చెప్పు... ఏమయింది నీకు''

''ఆమె నన్ను హెరాస్ చేస్తోంది'' వందన సిగ్గుగా తలవంచుకొంది.

ఎవరూ మిసెస్ గౌతమే... మాధవి ఆశ్చర్యంగా చూసింది. తమ యాడ్ ఏజెన్సీకి వచ్చిన రోజు మిసెస్ గౌతమ్ వందన మీద ఎంత ప్రేమ చూపించిందో. తనకు ఇప్పటికీ గుర్తే.

''షి ఈజ్ మై లిటిల్ డాల్ మేడమ్. చాలా సున్నితమైన పిల్ల. నేను ఎడాప్ట్ చేసుకొన్నానండీ. తను పొయిట్రీ రాస్తుంది. యాడ్ డిజైనింగ్ మీద స్పెషల్ కోర్సు చేసింది. మీరు తనకు అవకాశం ఇచ్చి చూడండి. తను మంచి కాప్షన్స్ రాస్తుంది. చూడు నాన్నా... నువు రాసినవి చూపించు'' వందన భుజాల చుట్టూ చేతులు వేసి మరీ అభిమానంగా తన ముందుకి తీసుకువచ్చిన తీరు తనకి ఇప్పటికీ గుర్తే. శాంతి ఆశ్చర్యంగా చూస్తోంది.

''నిజంగా నన్ను ఆవిడ బాధపెడుతుందండీ. నేను ఆవిడను భరించలేకపోతున్నాను''

''అంటే పోట్లాడుతుందా? కొడుతుందా? నిన్ను పెంచుకొన్నానని చెప్తోందే?''

''నిజమే. అమ్మ పోతే ఆమె దగ్గరే పెరిగాను. చాలా ప్రేమ. చాలా ప్రేమగా చూస్తుంది. నేనదే భరించలేకపోతున్నా''

''అంటే...?''

''ఆవిడ నన్ను తన దగ్గర పడుకోమంటుంది. ఆవిడ మగాడిలా ప్రవర్తిస్తుంది. ప్రతిరోజూ నాకీ నరకం తప్పదు''

మాధవి, శాంతి తెల్లబోయి చూస్తున్నారు. వందన మాటలు వింటుంటే ఆ అమ్మాయిని చూస్తుంటే ఆశ్చర్యంగా ఉంది వాళ్ళకి.

మాధవికి ఏం మాట్లాడాలో తెలియలేదు.

''అదేమిటి? నీవెలా ఒప్పుకొన్నావు?''

''ఏం చేస్తాను. నేనెక్కడికి పోతాను. అక్కడ వుండక ఎక్కడికి పోను. ఆవిడ నుంచి ఎలా తప్పించుకోను?'' వందన మళ్ళా ఏడవడం మొదలుపెట్టింది.

''అసలావిడ దగ్గర ఎలా చేరావు?''

''అమ్మ వాళ్ళింట్లో పనిచేసేది. నాన్న చిన్నప్పుడే పోయాడు. అమ్మ పోగానే ఆవిడ నన్ను తనింట్లోనే వుంచేసుకొంది''

''ఆవిడ ఏం చేస్తుంది నిన్ను''

''ఎప్పుడూ తన దగ్గర బట్టలు విప్పేసి పడుకోమంటుంది. వళ్లంతా నిమురుతుంది. నేనలా వద్దన్నా ఆమె వినిపించుకొనేది కాదు. ఆవిడకు ఉద్రేకం వచ్చిందంటే నా పని అయిపోతుంది. ఆవిడ కోరిక తీరదు. నన్ను వదలదు. పైగా తనకు హార్ట్ఎటాక్ వచ్చిందని, గౌతమ్‌గారు అన్యాయం అయిపోతారని చెప్పేది. గౌతమ్‌గారి పనులన్నీ చేయమనేది''

ఆయన చాలా స్నేహంగా ఉంటారు. నేనంటే చాలా ఇష్టం. నేను కాలేజీలో చదివేటప్పుడు రోజూ ఈవినింగ్ కాలేజీకి వచ్చేవారు. నాకు అవసరమైన డబ్బు రహస్యంగా ఇచ్చేవారు. నెమ్మదిగా ఆయన మీద నాకు ఇష్టం పెరిగింది. ఆయన కోసం ఆమె చెప్పినట్లు వినేదాన్ని. లేకపోతే నన్ను బయటికి పంపేస్తానని బెదిరిస్తుంది.

''ఆవిడ నిన్ను ఏమేం చేయమని అడుగుతుంది?''

శాంతికి టెన్షన్‌గా ఉంది. సెక్స్ గురించి తెలిసిందే. ఇట్స్ వండర్‌ఫుల్ గేమ్. ఇలాంటివి తెలిసినా అదో గగుర్పాటు.

చందన ఓ నిముషం తటపటాయించింది. వాళ్ళిద్దరినీ చూస్తుంటే చెప్పుకోవాలనిపిస్తోంది. తనకిటువంటి అవకాశం వస్తుందో రాదో? ఈ మాత్రం ఊరట ఎప్పుడైనా పొందిందా?

నా రొమ్ములు ఎంత అందంగా ఉన్నాయోనని ఎప్పుడూ అలా చూస్తుంది. నా వళ్ళు ఎలా ఉందో వర్ణించి వర్ణించి, ముట్టుకొని ముట్టుకొని చెపుతుంది. తనలా ముట్టుకొంటుంటే కాదనలేక ఒక రకంగా అలవాటయి పోయి ఊరుకున్నాను. పక్క గదిలో గౌతమ్‌గారుంటారు. ఆయన ప్రతి నిముషం నన్ను తలుచుకొంటారు. నేను అనుభవిస్తున్న వేదన ఆయనకు ఎంత బాగా తెలుసంటే... నేను ఏ అర్ధరాత్రో ఆమె నుంచి బయటపడి వచ్చేసరికి ఆయన దిగులుగా ఎదురు చూస్తుంటారు పాపం''

చందన కళ్ళు నీళ్ళతో నిండిపోయాయి.

''అంటే ఆయనకు ఈ విషయం తెలుసన్నమాట'' శాంతి మొహం చిట్లించింది. ఆ అమ్మాయికి ఒక్క నిమిషంలో సర్వం అర్థమయి పోయింది. చందన ఆశ్చర్యంగా చూసింది.

''ఎందుకు తెలియదు. అసలు ఆవిడకు ఇది యూనివర్సిటీలో అలవాటయిందట. అది తెలిసి పెళ్ళినాటి నుంచి ఈయన ఆమెను ముట్టుకోలేదట. మరి చీదరగా ఉండదండీ పాపం ఆయనకు. ఈవిడ రెచ్చిపోయి పిచ్చిదాని లాగా ప్రవర్తించేదట. ఆయన మాత్రం దగ్గరకు రానీయడండీ... పాపం నేనంటే ఆయనకు చాలా ఇష్టం. చందనా నీవే లేకపోతే నేను నిజంగా చచ్చిపోయే వాడిని అంటారు ఎప్పుడూ'' అంది గర్వంగా.

శాంతి, మధు మొహామొహాలు చూసుకున్నారు.

''అసలు ఆవిడ, నువ్వు ఎంతగా ఎలా నష్టపోతున్నారో అర్థం అయిందా చందనా?''

''ఆవిడ నష్టపోవటం ఏమిటి? ఆవిడకేం ఆమె హాపీగా ఉంటుందే'' అంది చందన.

''ఓహో... హాపీగా. వెుుగుడితో కొట్లాడుతూ తీరని కోరికలతో సతమతమయిపోతూ... నీకోసం... సర్వం నీ కళ్ళ ముందుకి పెడుతూ... ఆవిడ సంతోషంగా ఉందని నువ్వెలా అనుకొన్నావు చందనా?''

చందన మాట్లాడలేదు.

'మధూ... నీకు అర్థం అయిందా ఈ మగాడే ఎలా డబుల్ గేమ్ ఆడుతున్నాడో. అటు భార్య పూర్వ జీవితం పేరుతో నచ్చని ఆమెను దూరం పెట్టాడు. పోనీ ఆమెను వదిలేశాడా?

లేదు. ఆవిడ డబ్బు, అందుమూలంగా వచ్చే సౌకర్యాలు కావాలి అవేవీ వదలడు. ఇటువైపు భార్య తెచ్చిన చందనని వదలడు. తన జీవితంలో లోటు బయటపడకుండా అటు భార్య కోసమూ, తన కోసమూ చందనను వాడుకున్నాడు. చందనా... లుక్... నువ్వు పిచ్చిదానివి అర్థం అయిందా? నువ్వు అనవసరంగా ఇతని కోసం ఆమెను... మళ్ళా ఇతన్ని భరిస్తున్నావు. అసలు నాకయితే తప్పు పూర్తిగా నీదేననిపించింది''

చందన కళ్ళు నిండిపోతున్నాయి.

''అతనికి నేనంటే చాలా ఇష్టం'' అన్నది నిస్సహాయంగా.

''ఎలాటి ఇష్టం. భార్యను మన్నించి ఆమెను ఆదరించే మంచితనమా? ఆమె చేతుల్లోంచి నిన్ను తప్పించాడా? పోనీ తను వాడుకోవడం మానేశాడా? ఏదీ చేయలేదు. పోనీ పబ్లిక్‌గా తన ప్రియురాలనో, భార్యనో చెప్పేడా? ఏం చేశాడు. నీకు సెక్యూర్డ్‌గా డబ్బు ఆధారమైనా చూపించాడా? ఇన్నాళ్ళ నుంచి మా దగ్గర పనిచేస్తున్నావు. నెలకు నేనిచ్చిన డబ్బులు నీ దగ్గరే ఉన్నాయా? ఏం చేశావు?''

చందన భయంగా చూసింది.

''లేవు. అన్నీ ఇంట్లో ఇచ్చేయాలి. నాకు చీరెలు కొంటారు. ఆవిడ నగలు వేసుకోనేందుకు ఇస్తారు. ఇంట్లో సర్వం నేనే చూసుకోవాలి.''

ఒక్కో విషయం చెప్పుకుపోతుంటే చందనకే తన పరిస్థితి అర్థం అయినట్లుంది కాబోలు నెమ్మదిగా ఏడవటం మొదలుపెట్టింది.

హృదయం కరిగిపోయింది శాంతికి. చందన చేయి తన చేతిలోకి తీసుకుంది.

''చూడు. ఇప్పటికయినా తెలుసుకో. ఇక మీద ఏం చేయాలో నిర్ణయించుకో. నీ గమ్యం ఏదో ఒకటి ఉండాలిగా. వయసు ఉన్నంతకాలం ఇలా వాళ్ళద్దరి మధ్య బంతిలాగ బతుకుతావా?''

చందన తల అడ్డంగా తిప్పింది.

వెక్కిళ్ళ మధ్య 'నేనెక్కడికి పోనూ?' అన్నది.

''ఇంటికి పోవా...?'' అన్నది ఆలోచనగా శాంతి.

''నన్నేం అడక్కండి. నేనేం చేయాలో చెప్పండి'' స్థిరంగా అన్నది చందన.

శాంతి ఆలోచిస్తూ బయటకు చూసింది. వర్షం వెలిసిపోయింది. రోడ్డుమీద లైట్లు

వెలిగాయి. అంతా వెలుతురుగా ఉంది.

బద్ధకంగా లేచి తాళాలు అందుకుంది శాంతి.

''పద మా ఇంటికి పోదాం''

''మీ ఇంటికా... మీకు ఇబ్బంది కాదూ''

శాంతి నవ్వింది.

''అక్కడ చాలా మంది ఉన్నారు. ఇవ్వాళ ప్రొద్దుటే బిడ్డని పోగొట్టుకున్న తల్లి ఉంది. రెండు రోజుల క్రితం వాళ్ళమ్మని అడ్వర్లీ కింద అరెస్టు చేస్తే, రోడ్డు మీద మిగిలిన ఇద్దరు చిన్నపిల్లలున్నారు. అందులో చిన్నపిల్లకు రెండేళ్ళు. వాళ్ళంతా గజ్జి... గోక్కోవటం ఏడవటం దాని పని... పద... పద... చాలా పని వుంది''

చందన కళ్ళు తుడుచుకుంది. శాంతి వంక చూసి నవ్వింది

'నాకు వంట బాగా వచ్చు' అంది.

''అదేనా... అబ్బ ఎంత పనుందో...' అంది శాంతి.

★

సుప్రభాతం
***28.12.1997***